క్లుప్తంగా

వైకుంఠధామానికి దారేది..


వరి మళ్లలోంచి పాడె తీసుకెళ్తున్న దళితులు

చండ్రుగొండ: చండ్రుగొండలోని అంబేడ్కర్ నగర్‌లో దళితుల శ్మశాన వాటికకు దారి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం కాలనీకి చెందిన పెంబుల శ్రీను అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందగా.. దహన సంస్కారాలకు తీసుకెళ్లేందుకు దారి లేకుండా పోయింది. దీంతో దళితులు నాటు వేసిన మడుల గుండా పాడెను తీసుకెళ్లేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. కొన్నేళ్లుగా ఈ సమస్యపై తాము విజ్ఞప్తులు చేస్తున్నా ఫలితం లేకుండాపోయిందని వారు పేర్కొన్నారు.

సింగరేణీయుల ప్లాంటేషన్

మణుగూరుటౌన్: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అందరూ మొక్కలు నాటి వన సంపదను ముందు తరాలకు వారసత్వంగా అందించాలని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. బుధవారం కేఎల్‌పీ సమీపంలో అధికారులతో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ఎంతో ఎత్తులో ఉండే డంపింగ్ యార్డులో సైతం మొక్కలు నాటడం సింగరేణి నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

కార్డెన్ సెర్చ్..

మణుగూరురూరల్: మండల పరిధిలోని వలస గొత్తికోయ గ్రామమైన రేగులగండిలో సీఐ సతీష్‌కుమార్ సిబ్బందితో కలిసి బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులందరితో సమావేశమై మాట్లాడారు. గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నిషేధిత మావోయిస్టులకు సహాయ సహకారాలు అందించవద్దని సూచించారు. ఎస్సై రంజిత్, పోలీస్, టీజీఎస్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా

ములకలపల్లి: ఇసుక అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. మండల పరిధిలోని సత్యంపేట శివారులోని సీతారామా ప్రాజెక్ట్ ఎస్కేప్ రెగ్యులేటర్ సమీపంలో ఇసుక దందాకు తెరలేపినట్లు తెలిసింది. ఈ ప్రదేశంలో భారీగా ఇసుక అక్రమంగా నిల్వ చేసి.. లారీల్లో రాత్రి వేళ ఖమ్మం, హైదరాబాద్ వంటి ప్రదేశాలకు తరలిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. గత రాత్రి సైతం పదుల సంఖ్యలో లారీల్లో ఇసుక అక్రయంగా తరలించినట్లు సమాచారం.

సేవలు చిరస్మరణీయం

చర్ల: ఏజెన్సీ ప్రాంతానికి ప్రముఖ విద్యావేత, సంఘ సంస్కర్త సీవీకే రావు చేసిన సేవలు చిరస్మరణీయమని హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరావు పేర్కొన్నారు. చర్లలో బుధవారం జరిగిన సీవీకే రావు 2వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీవీకేరావు విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. అనంతరం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సీవీకే రావు వ్యక్తిత్వాన్ని వివరించారు. అనంతరం పలువురికి నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో సీవీకేరావు తనయుడు హైకోర్టు అడ్వకేట్ సీవీ సతీష్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ ఈదయ్య, టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాదరావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దోషులను శిక్షించాలి

మణుగూరురూరల్: కలకత్తాలో వైద్యవిద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మణుగూరు పీపుల్స్ సోషల్ మీడియా ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో నిరసన ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ సురక్షాబస్టాండ్ మీదుగా పూలమార్కెట్ సెంటర్ వరకు కొనసాగింది. మానవహక్కుల పరిరక్షణ సమితి సభ్యులు, ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రైవేట్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ సందర్శన

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డులో ఉన్న మార్కెట్‌లో బుధవారం భద్రాచలం గ్రామ పంచాయతీ ఈవో శ్రీనివాసరావు సందర్శించారు. వ్యాపారస్తులతో ఆయన మాట్లాడుతూ.. చికెన్ వ్యాపారాలు పరిసరాల్లోని డ్రెయినేజీల్లో చికెన్ వ్యర్థాలను వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంత నిర్వహించే వారు మిగిలిపోయిన కూరగాయలను చెత్తలో వేయాలని, రోడ్లపై పడేస్తే వారిపైనా చర్యలు తప్పవని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కరకగూడెం: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పినపాక మండలం గడ్డంపల్లి గ్రామానికి చెందిన గొంది మురళి మేడారం వెళ్లి పని ముగించుకొని తన స్వగ్రామానికి వస్తుండగా.. ఈ క్రమంలో కరకగూడెం మండలం వెంకట్రాంపురం గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడింది. గాయాలైన బాధితుడిని స్థానికులు 108 వాహనంలో కరకగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడ నుంచి మణుగూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గ్రామాలను అభివృద్ధి చేయాలి

- అధికారులకు ఎమ్మెల్యే పాయం సూచన
- పలు గ్రామాల్లో పర్యటన

కరకగూడెం: గ్రామాలను అభివృద్ధి పథంలోకి తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత మండల పరిధిలోని కొత్తగూడెం, చొప్పాల, తుమ్మలగూడెం, అనంతారం, పద్మాపురం గ్రామ పంచాయతీల్లో అధికారులతో సమస్యలపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ప్రజలు తెలిపిన సమస్యలపై అధికారులతో చర్చించారు. అలాగే మండలంలోని కొత్తగూడెం, చొప్పాల పంచాయతీలో సుమారుగా రూ.19 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన నాలుగు సీసీ రోడ్లను ప్రారంభించి తుమ్మలగూడెం, అనంతారం, పద్మాపురం గ్రామపంచాయతీలో సుమారుగా రూ.21 లక్షల అంచనా వ్యయంతో మంజూరైనా సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కరకగూడెం మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యుత్ సౌకర్యం, ప్రహరి, మరుగుదొడ్లు లేవనీ మణుగూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ జయలక్ష్మి ఎమ్మెల్యేకు తెలుపగా వాటిని అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. మండలంలో విధులు నిర్వర్తిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడం లేదని పలు గ్రామాల వారు తెలుపగా.. ఆయా ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని పినపాక ఎంఈఓ వీరస్వామికి ఆదేశించారు. అదేవిధంగా పులుసుబొంత ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయించి, రైతులకు రెండు పంటలు పండేలాగా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, పార్టీ నాయకలు చందా సంతోష్, పోలెబోయిన శ్రీవాణి, ఎర్ర సురేష్, కొమరం కాంతారావు, తోలెం నాగేశ్వరరావు, జలగం కృష్ణ మండలంలోని అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఆస్పత్రిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన సౌకర్యాల కల్పిస్తానని, రోగులకు ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు నిరంతరం అందాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ నెల 12వ తారీఖున 'సాక్షి'లో సదరు ఆస్పత్రిలో పేరుకుపోయిన సమస్యలను ప్రస్తావిస్తూ 'నిధుల కోసం ఎదురుచూపులు' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బుధవారం సదరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ఆస్పత్రి చుట్టూ కలియ తిరుగుతూ సమస్యను అడిగి తెలుసుకున్నారు. నూతన ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఆసుపత్రిలో మౌలిక సౌకర్యాల కల్పనకు నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సిబ్బంది కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీలో షరతులు తొలగించాలి


దుమ్ముగూడెం: రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దుమ్ముగూడెం: ఎన్నికల ముందు చెప్పిన విధంగా అందరికీ షరతులు లేని రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి కొడాలి లోకేష్ డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు బొల్లి సత్యనారాయణ, గిరిజన సంఘం నాయకులు కారం పుల్లయ్య, రైతు సంఘం నాయకులు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, యలమంచి శీనుబాబు, బొల్లి సాయిబాబు, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ రాస్తారోకో..

రుణమాఫీ కానీ రైతులకు వెంటనే ఎటువంటి ఆంక్షలు లేకుండా మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ.. బీఆర్‌ఎస్ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏపీజీవీబీ బ్యాంకు ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారయణమూర్తి మాట్లాడారు. మండల కార్యదర్శి కణితి రాముడు, నాయకులు జాని పాషా, దామెర్ల శ్రీనివాసరావు, కొత్తూరి సీతారామారావు, నోముల రామిరెడ్డి, బొల్లి వెంకట్రావు, దన్ని అప్పారావు, పోడియం సుబ్బారావు, మడకం రామారావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: తక్షణమే ఏలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని కోరుతూ బుధవారం రైతులు నిరసన దీక్ష చేపట్టారు. స్థానిక రింగ్ రోడ్ సెంటర్‌లో రైతులు చేపట్టిన ఈ దీక్షా శిబిరాన్ని అశ్వారావుపేట మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తమ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చిట్టూరి ఫణీంద్ర, బీఆర్‌ఎస్ నాయకులు సత్యవరపు సంపూర్ణ, చిప్పనపల్లి బజారయ్య, జుజ్జురపు శ్రీరామ్మూర్తి, ఆనంద్ పాల్గొన్నారు.

26 నుంచి డిగ్రీ తరగతులు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 26వ తేదీ నుంచి విద్యార్థులకు తరగతులు ప్రారంభిస్తామని డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.గోపి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ కళాశాలను నిర్వహించేందుకు గదులను పరిశీలించారు. అనంతరం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనితను కలిసి విద్యార్థులకు సరిపడ గదులను కేటాయించాలని కోరారు. దీంతో డిగ్రీ కళాశాల విద్యార్థులకు కొన్ని గదులను కేటాయించారు. కార్యక్రమంలో సత్తుపల్లి జేవీఆర్ కళాశాల అధ్యాపకులు ఎస్‌కె.ఫీర్ సాహెబ్, చెన్నారావు, వీరారెడ్డి పాల్గొన్నారు.

'ఛిద్రమవుతున్న యువత జీవితాలు'

మణుగూరురూరల్: యువత దురలవాట్లకు బానిసలై జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పేర్కొన్నారు. మణుగూరు మండలంలోని విద్యాసంస్థలు, మార్కెట్ల వద్ద మత్తు పదార్థాల అమ్మకం సాగుతుండడంతో యువత బానిసలవుతున్నారని తెలిపారు. ఇకనైనా పోలీసులు నిఘా పెంచి మత్తు పదార్థాల అమ్మకాన్ని అరికట్టడం ద్వారా యువత జీవితాలను కాపాడాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

సెక్యూరిటీ అధికారికి సన్మానం

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియాలో సెక్యూరిటీ అధికారిగా పనిచేసి బదిలీపై రామగుండం వెళ్తున్న షబ్బీరుద్దీన్, సతీమణి షబానాను మురళ మ్యాన్ పవర్ ఏజెన్సీ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల రోడ్డుపై గాయాలతో ఉన్న కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డును ఆస్పత్రికి తరలించిన ఎస్‌ఓటూ జీఎం శ్యాంసుందర్‌ను సైతం కార్మికులు ఘనంగా సన్మానించారు. విశ్వాస్ యూత్ వ్యవస్థాపకుడు, సామాజిక కార్యకర్త ఎస్‌డీ నాజర్‌పాషా, జమేదార్ షేక్ అక్బర్, రాములు, సూపర్‌వైజర్లు రామవతార్, సుధాకర్, షేక్ రబ్బాని, గార్డులు పాల్గొన్నారు.

కార్యదర్శి అరెస్ట్ అన్యాయం

గుండాల: ఆళ్లపల్లి మండలంలో ఎంపీఓ, మర్కోడ్ గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఏసీబీ అధికారులు పట్టుకున్న సంఘటనలో కార్యదర్శి నాగరాజుకు ఎటువంటి సంబంధం లేదని తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు కొడెం వెంకటేశ్వర్లు బుధవారం ఓ ప్రకటనలో అభిప్రాయపడ్డారు. రాజకీయ కక్షపూరితంగా ఒక ఆదివాసీ అయినందునే ఇప్పటి వరకు ఎటువంటి మచ్చలేని పంచాయతీ కార్యదర్శి నాగరాజును పట్టించారన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

మణుగూరురూరల్: మండల పరిధిలోని కొండాయిగూడెం, చిక్కుడుగుంట గ్రామాల్లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, డాక్టర్ నిశాంత్‌రావులు గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. పీహెచ్‌ఎస్ సత్తెమ్మ, ఎస్‌యూఓ వీరస్వామి, వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఉమేష్, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గొత్తికోయ గూడెంలో..

చండ్రుగొండ: బెండాలపాడు శివారు గొత్తికోయగూడెంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చైతన్య శిబిరాన్ని సందర్శించి గర్భిణులు, చిన్న పిల్లల తల్లులను పరీక్షించారు. కమ్యూనిటీ ఆఫీసర్ కుమారస్వామి, డాక్టర్ తనూజ, సిబ్బంది సుమతి, రమణమ్మ, ఆశాలు రాజేశ్వరి, అరుణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గురుకులంలో..

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో ఎర్రగుంట పీహెచ్‌సీలో ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బుధవారం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిబిరంలో వైద్య సిబ్బంది విద్యార్థులను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. డీపీఎంఓ వెంకటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాశరావు, ఎంఎల్‌హెచ్‌పీ సోనియా, రాందాసు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పని వేళలు సవరించాలి

భద్రాచలంటౌన్: రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలో పని వేళలను సవరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు అన్నారు. భద్రాచలం మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా స్థానిక మైనారిటీ గురుకులం పాఠశాలలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గురుకులాల్లో అమలవుతున్న పని వేళలు విద్యార్థులను మానసికంగా ఒత్తిడికి గురి చేసే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. మాధురి, మహేష్, దామోదర్, జీవన్, విజయ్ కుమార్, రమేష్, ఆశాలత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

గుండాల: మండల కేంద్రంలోని రామాలయం వద్ద నిర్మించిన అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థం రామక్రిష్ణ, సనత్‌లు విగ్రహ నిర్మాణ ధాత తిరుక్కొవళ్లూరి వెంకటేశ్వర్లు, పట్వారి వెంకన్న-హరిప్రియ దంపతులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహంపై పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ ఆంజనేయ స్వామి విగ్రహంతో మండల కేంద్రంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయక కమిటీ సభ్యులు మానాల వెంకటేశ్వర్లు, బత్తిని సాయన్న, కోడూరి శ్యాం, అప్పారావు పాల్గొన్నారు.


పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పురోహితులు

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

దుమ్ముగూడెం: రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేసినందుకు బుధవారం దుమ్ముగూడెం పీఏసీఎస్ కార్యాలయం వద్ద సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రుల చిత్రపటాలకు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు మాట్లాడారు. నాయకులు కుంజ శ్రీనివాస్,పిలక వెంకటరమణారెడ్డి,కోడి చంటి,కొమ్ము రంజిత్, శిరపు అప్పల రెడ్డి, బాలాజీ, శేఖర్, సందీప్ రెడ్డి, రాంప్రసాద్ పాల్గొన్నారు.

తిరుపతయ్య ఆశయసాధనకు పనిచేయాలి

బూర్గంపాడు: సీపీఎం పట్ల అంకితభావంతో పనిచేసిన బర్ల తిరుపతయ్య ఆశయసాధనకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. తిరుపతయ్య సంతాపసభను బుధవారం బూర్గంపాడులో నిర్వహించగా.. వెంకటేశ్వర్లు మాట్లాడారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్, ఎంబీ నర్సారెడ్డి, ఆర్.వెంకటేశ్వరరావు, ఆర్.నాగేశ్వరరావు, కె.వీరభద్రం, బత్తుల వెంకటేశ్వర్లు, బయ్యా రాము, రాయల వెంకటేశ్వర్లు, సరోజని, కృష్ణ, శ్యామల అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మ్యాన్‌వే ఏర్పాటు చేయాలి

మణుగూరుటౌన్: నూతనంగా ఏర్పాటు చేసిన ఓసీ-2 సైట్ ఆఫీస్‌లో ఒకే మ్యాన్‌వే ఉండటం వల్ల మస్టర్ నమోదు సమయంలో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మరో మ్యాన్ వే ఏర్పాటు చేయాలని టీడీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ కోరారు. ఈ మేరకు బుధవారం ఏరియా ఎస్‌ఓటూ జీఎం శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. బంగారి పవన్, మస్తాన్, నాగేశ్వరరావు, ఆపరేటర్ ముకేశ్, జీఎం ఆఫీస్ ఫిట్ సెక్రటరీ శ్రీనివాస్ తదితరులన్నారు.

రెండ్రోజుల్లో 170 దరఖాస్తులు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ తమకు రాలేదని, పెద్ద సంఖ్యలో రైతులు రైతువేదిక వద్దకు పరుగులు తీస్తున్నారు. మంగళ, బుధవారం వ్యవసాయ అధికారులు అశ్వారావుపేటలోని రైతువేదికలో దరఖాస్తులు స్వీకరించగా.. 170 మంది రైతులు తమకు రుణమాఫీ కాలేదని దరఖాస్తులు చేసుకున్నట్లు స్థానిక ఏఓ శివరాం ప్రసాద్ తెలిపారు. కాగా, ఈ దరఖాస్తుల్లో అధికంగా రేషన్ కార్డులు లేనివి ఉండగా, ఆధార్, బ్యాంక్ ఖాతా లింక్ లేనివి మరికొన్ని ఉన్నాయి.

మౌనదీక్ష..

చండ్రుగొండ: మున్నూరుకాపులకు సదుపాయాలను కల్పించాలని రాష్ట్ర సంఘం పిలుపు మేరకు తిప్పనపల్లి గ్రామంలో సంఘం జిల్లా నాయకుడు లంకా నరసింహారావు తన కుటుంబంతో బుధవారం మౌనపోరాట దీక్ష చేశారు. నోటికి మాస్క్ పెట్టుకుని నిరసన తెలిపారు.



భారత్‌బంద్ విజయవంతం

మాలమహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన భారత్ బంద్ బుధవారం విజయవంతంగా, ప్రశాంతంగా ముగిసింది. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్ట్ ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా మాల మహానాడు చేపట్టిన ఈ బంద్.. పలు ప్రాంతాల్లో కొనసాగింది. ఇందులో భాగంగా నాయకులు, కార్యకర్తలు పాఠశాలలను, వ్యాపార కూడళ్లు, బ్యాంకులను మూయించారు. ఎస్సీ వర్గీకరణ వల్ల దళితుల ఐక్యత దెబ్బతింటుందని ఈ సందర్భంగా నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


అన్నపురెడ్డిపల్లిలో మూతబడిన దుకాణాలు


భద్రాచలంటౌన్: బస్టాండ్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు


చండ్రుగొండ: బంద్ సందర్భంగా నిరసన తెలుపుతున్న మాలమహానాడు కార్యకర్తలు